# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## స్పందనకు 129 అర్జీలు



చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి 129 సమస్యలపై ప్రజలు అధికారులకు అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు స్పందన కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరించి సత్వరం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి అత్యధికంగా రెవెన్యూ శాఖ నుండి 89 అర్జీలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డికె బాలాజీతో కలిసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు డిఆర్ఓ పెంచల్ కిషోర్, ఎస్‌డిసిలు శ్రీనివాసులు, భాస్కర్ నాయుడు, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. మొత్తం 67 వినతులు రావడం జరిగిందని, సదురు అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# బంద్ ప్రశాంతం

### చంద్రబాబు రిమాండ్‌కు నిరసనగా పూతలపట్టులో 6 ఆర్టీసీ బస్సులపై దాడి - ముఖ్య నేతలు హౌస్ అరెస్టు

### దుకాణాలు మూయించడానికి ప్రయత్నించిన 'దేశం' నేతలు అరెస్టు - పాక్షికంగా తిరిగిన ఆర్టీసీ బస్సులు







**చిత్తూరులో ఆర్టీసీ బస్సును అడ్డుకొంటున్న దేశం నాయకులు, హైరోడ్డులో పాత టైర్లకు నిప్పు పెట్టిన దేశం నాయకులు, జిల్లా దేశం ఉపాధ్యక్షుడిని తీసుకెళ్తున్న పోలీసులు.**

చిత్తూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రిమాండ్‌ను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన బంద్ చిత్తూరు జిల్లాలో పాక్షికంగా జరిగింది. చిత్తూరు, జి.డి.నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి నియోజకవర్గాల్లో పోలీసులు సోమవారం తెల్లవారుజామునే తెలుగుదేశం ముఖ్య నేతలను హౌస్ అరెస్టులు చేశారు. పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బంద్ నిర్వహించడానికి ప్రయత్నిస్తే పలుచోట్ల వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. పూతలపట్టు నియోజకవర్గ పరిధిలో పూతలపట్టు, యాదమరి మండలాల్లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు బస్సులపై దాడులు నిర్వహించి అద్దాలు పగులగొట్టారు. పూతలపట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు 6 ఆర్టీసీ బస్సులపై దాడులు చేశారు. ఈ దాడులకు కారణమైన నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ మురళీమోహన్, మండల దేశం నాయకుడు దొరబాబులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. బంద్ సందర్భంగా చిత్తూరు నగర పరిధిలో చిత్తూరు –బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ ఆర్టీసీ బస్సుపై జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, ఆయన అనుచరులు గోకుల్ ఆదిత్య, సల్మాన్‌లు దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. ఈ విషయమై టుటౌన్ ఇన్స్‌పెక్టర్ మద్దయ్యఅచ్చారి ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. చిత్తూరులో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్ తదితర నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ హౌస్ అరెస్టు నుండి తప్పించుకొని నాయకులు, కార్యకర్తలతో నగరంలో బైక్ ర్యాలీ నిర్వ హించి దుకాణాలు మూసి వేయడానికి ప్రయత్నించారు. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కాజూరు బాలాజీ, జాఫర్, జనార్ధన్ తదితరులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సోమవారం తెల్లవారుజాము అత్యధిక ప్రదేశాల్లో దుకాణాలు తెరుచుకోలేదు. ఉదయం 10 గంటలకు పైబడి కొన్ని దుకాణా లు తెరిచి వ్యాపారులు ప్రారంభించారు. అయితే కొన్ని చోట్ల ఆర్టీ సీ బస్సులపై తెలుగుదేశం నాయకులు దాడులు చేయడంతో ఆర్టీసీ బస్సులు మళ్ళీ డిపోలకు చేరాయి.

## తిరుపతిలో బంద్ నిర్వీర్యం

### రోడ్డుపైకి రానీయకుండా నేతల గృహనిర్బంధం -ఆందోళనతో కేడర్ బలవంతపు అరెస్టులు



తిరుపతి, సెప్టెంబర్ 11ప్రభాతవార్త: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశంఅధినేత చంద్రబాబునాయుడును ప్రభుత్వం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ సోమవారం టిడిపి చేపట్టిన బంద్ నామమాత్రంగా మారింది. బంద్‌లో టిడిపి, జనసేన పార్టీలు నేతలు కూడా ఐక్యంగా పాల్గొన్నారు. చంద్రబాబు సొంతజిల్లాలో తిరుపతి నియోజకవర్గంలో కొంత ప్రాధాన్యత ఉండటంతో ఇక్కడ పోలీసు అధికారులు మరింత గట్టి భద్రతాచర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో 144సెక్షన్ అమలు చేయడంతో ఉదయం 5గంటలకు తిరుపతిలో ముఖ్యనేతలను ఇన్‌ఛార్జి సుగుణమ్మ, నరసింహయాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, ఎన్‌బి సుధాకర్‌రెడ్డి, మబ్బుదేవనారాయణరెడ్డి గృహనిర్బంధంలో ఉంచారు. కొందరు ముందుగానే రోడ్లపైకి చేరుకుని అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ శాంతియుత నిరసనలకు దిగారు. తిరుపతిలో ఓ దశలో ఆర్టీసి బస్టాండుకు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తిరుపతికి చెందిన టిడిపి నాయకులు పుష్పావతియాదవ్, కుమారమ్మ, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట చిన్నబాబు, బుల్లెట్‌రమణ పలువురు మహిళా నేతలు తదితరులు శాంతియుతంగా చేతుల్లో పార్టీ జెండాలు పట్టుకుని నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న తిరుపతి పోలీసులు భారీగా చేరుకుని ఆందోళనకారులను అరెస్టుచేశారు.



## కలకలం రేపిన బాంబులు





**తెరణి వెళ్లే మార్గంలోని పొలాల్లో తనిఖీలు చేస్తున్న స్క్వాడ్ పోలీసులు, వరి పొలంలో ఉన్న నాటు బాంబులు**

నగరి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: మండలంలోని నగరి రైల్వేస్టేషన్ నుంచి తెరణి గ్రామానికి వెళ్లే మార్గంలో వ్యవసాయ పొలంలో నాటు బాంబులు ఉన్న ఘటన గ్రామంలో కలకలం రేగింది. తమిళనాడు నుంచి వచ్చిన బాంబు స్క్వాడ్ నాలుగు బాంబులను స్వాధీనం చేసుకోవడంతో గ్రామస్థులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా... ఈ నెల 5వ తేదీ చెన్నై నరసపేట సమీపం గల తిరుమయిసైకు చెందిన ఏబినేషర్ అనే రౌడీ షీటర్‌ను శ్రీ పెరంబదూరు సమీపం నాటు బాంబు వేసి గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారు. ఈ కేసులో ముద్దాయిలు ఇచ్చిన సమాచారం మేరకు నగరి మండలం తెరణి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న పొలాల్లో నాలుగు నాటు బాంబులు పడేసినట్లు తెలిసింది. దీంతో సోమవారం నగరి పోలీసుల సాయంతో తెరణి గ్రామంలో బాంబులు పడేసిన పొలాల వద్దకు సంబంధిత ముద్దాయితో పాటు తమిళనాడు పోలీసులు బాంబు స్క్వాడ్‌తో పాటు చేరుకున్నారు. వరి సాగులో ఉన్న పొలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అందులోఉన్న నాలుగు నాటు బాంబులను జాగ్రత్తగా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వీఆర్‌వో, పోలీసుల సమ్మతితో అక్కడి నుంచి వాటిని తీసుకెళ్లారు.

## యుద్ధప్రాతిపదికన బ్రహ్మోత్సవ ఏర్పాట్లు



**రాజగోపురాలకు విద్యుత్ దీపాలంకరణ**

కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం వద్ద ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. బ్రహోత్సవాల నిర్వహణకు కేవలం ఆరు రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో ఆలయ అధికారులు ఏర్పాట్లును యుద్ధప్రాతిపదిక సాగిస్తున్నారు. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం వంటి పనులను చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అన్వేటి మండపంతో పాటు సుపథమండపంలలో రంగవల్లులను తీర్చిదిద్దుతున్నారు. అలాగే ప్రధాన ఆలయంలో పాటు పరివార ఆలయాలకు విద్యుత్‌దీపాలంకరణ పనులను చురుగ్గా నిర్వహిస్తున్నారు. అలాగే ఆలయ పరిసరాల్లో దేవతామూర్తుల విద్యుత్ ఆర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన ఏర్పాట్లును సకాలంలో పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



**సుపథమండపంలో తీర్చిదిద్దుతున్న రంగవల్లులు**

## రామాపురంలో దారిదోపిడి

### - ఏడున్నర లక్షల నగదు అపహరణ



**దోపిడిదొంగల దాడిలో గాయపడిన తడ ప్రభు**

తడ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలం రామాపురం వద్ద సోమవారం దారి దోపిడీ జరిగింది. స్థానిక మద్యం దుకాణం నుంచి మూడురోజులు వచ్చిన నగదును తీసుకొని తడలోని ఒక బ్యాంకులో జమ చేయడానికి మోటార్‌బైక్‌పై వస్తున్న తడ ప్రభు అనే యువకుడిపై రెండు మోటార్‌బైక్‌లలో వెంబడించిన ఇద్దరు యువకులు అతని వద్ద నుంచి నగదు ఉన్న బ్యాగును అపహరించుకొని వెళ్లిపోయారు. తడ మండలం భీములవారిపాలెంకు చెందిన ప్రభు కొంతకాలంగా మద్యం షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం జరిగిన ఘటనలో అతనిపై దుండగులు దాడి చేయడంతో గాయపడ్డాడు. బ్యాగులో ఏడు లక్షల 47వేల 120 రూపాయలు ఉన్నట్లు బాధితుడు తడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్ర, శని, ఆదివారాలలో వచ్చిన నగదును తీసుకెళుతుండగా ఈ దాడి జరిగినట్లు పేర్కొన్నారు. బాధితుడు సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటన జరిగిన వెంటనే తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి ఒక ప్రత్యేక బృందంతో రామాపురం వెళ్లి నిందితుల కోసం గాలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 175 స్థానాలు మావే : నేదురుమల్లి



వాకాడు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు గెలుపొందడం ఖాయమని, 2024 సంవత్సరంలో మరోసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతాడని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి సమన్వయకర్త, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి చెప్పారు. సోమవారం నేదురుమల్లి రామకుమార్ రెడ్డి నివాసంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు న్యాయమేనన్నారు. 330 కోట్లు కాకుండా సీమాన్స్ వాటా ఏమైందని, ఆ ఓటు మొత్తం దాదాపు 3 వేల 280 ఒక్క కోట్లు రూపాయలు పక్కదారి మళ్లింపు జరిగిందని అన్నారు. వాస్తవాలను విస్మరించి, టెక్నికల్ పాయింట్లు పై చంద్రబాబు నాయుడు తరపున ఢిల్లీ నుండి వచ్చిన లాయర్లు వినిపించిన న్యాయమే గెలుస్తుందన్నారు. తెలుగు దేశం పార్టీలోనే అప్పటి ఆ శాఖ మంత్రులు, అధికారులు ఎందుకు స్పందించడం లేదని రాం కుమార్ రెడ్డి ఎద్దేవ చేశారు 175 స్థానాలకు 175 స్థానాలు గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ ఛైర్మన్ దామోదర్ రెడ్డి, దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు రౌతు రామకృష్ణ, సర్పంచి మధుసూదన్ రెడ్డి, వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, నాయకులు మాజీ ఎంపిపి, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దువ్వూరు మధుసూధన్ రెడ్డి, నాగూర్ రెడ్డి, సునీల్ రెడ్డి, పాపా రెడ్డి, శశిధర్ రెడ్డి, షనీల్ రెడ్డి, తూపిలి రామచంద్రరెడ్డి, రవికుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

## వరుణ యాగంతో యావత్ దేశం సుభిక్షం..!

### కల్యాణ వెంకన్న ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు

### మహాపూర్ణాహుతితో మగిసిన మహాశాంతి యాగం

### టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి



చంద్రగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన వరుణ యాగంతో యావత్ దేశం సుభిక్షం కాగలదని టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి అన్నారు. కల్యాణ వెంకన్న ఆలయంలో మూడు రోజుల పాటు 210 మంది రుత్వికులు వైఖాసన ఆగ మోక్తంగా నిర్వహించిన శ్రీనివాస అష్టోత్తర శతకుంభాత్మక మహాశాంతి వరుణ యాగం సోమవారం మహాపూర్ణాహుతితో ముగిసింది. ఈ పూర్ణాహుతి కార్యక్రమానికి విచ్చేసిన టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ఎ.వి.ధర్మారెడ్డి ఆలయంలో గోపూజ నిర్వహించి, ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలుకురిసి రాష్ట్రం, దేశం సస్యశ్యామలం, సుభిక్షం కావాలనే సంకల్పంతో వరుణ యాగం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెఈఓ వీరబ్రహ్మం, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, టిటిడి ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజగోపాల్, డిపిపి కార్యదర్శి శ్రీనివాసులు, ఏఈఓ గోపినాద్, సూపరింటెంట్స్ తేనెపల్లి వెంకటస్వామి, నర్రా ముని చెంగల్రాయులు, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, బాలాజీ రంగాచార్యులు, కంకణ భట్టార్ సీతారామాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితంఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

## శ్రీవారికి పరదాలు



తిరుమల, సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి: బ్రహ్మోత్సవాలకు ముందు మంగళవారం జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమం అనంతరం స్వామివారికి పరదాలు సమర్పించడం తిరుపతికి చెందిన మణి పరిపాటిగా తీసుకున్నారు. దేవదేవునిపై భక్తివిశ్వాసాలతో ప్రతి ఏడాది ఇలా నాలుగు దఫాలు పరదాలు అందిస్తారు. తనే స్వయంగా తయారుచేసి టిటిడి తిరుమల ఆలయానికి సమర్పిస్తారు. మంగళవారం జరిగే కోయిల్ ఆళ్వారుతిరుమంజనం కార్యక్రమానికి ముందు సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న మణి దంపతులు ఐదుపరదాలు టిటిడికి అందించారు.

## స్వామి అమ్మవార్ల కళ్యాణం: మృత్యుంజయునికి అభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. సోమవారం తెలుగుదేశం పార్టీ బంద్‌కు పిలుపు ఇచ్చినా ఆలయం దర్శనాల మీద ప్రభావం చూపలేదు. సోమవారం స్వామి అమ్మవార్లకు 142 అభిషేకాలు జరగగా 3445 మంది రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకున్నారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 33 జరిగాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రవేశిస్తే ఎనలేని మధురాను భూతి కల్గుతుంది. ఇక్కడి ఆలయ నిర్మాణామో స్వామి అమ్మవార్ల మహత్యమో కాని ఆలయంలోని కంచుగడప దాటితే ఇక బయటి ప్రపంచం గుర్తుకురాదు. ఆధ్యాత్మిక చింతక కల్గుతుంది. ఇక ఆలయంలో ప్రవేశిస్తూనే ఎదురుగా చిన్మయముద్ర కల్గిన గురు దక్షిణామూర్తి దర్శనం లభిస్తుంది. ఇక ఎడమవైపును ఆకాశ గణపతి, ఆకాశ గంగ దర్శనం లభిస్తుంది. పక్కనే స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యకళ్యాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది. గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్య ధారణ కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో దేవస్థానం నిర్వహించే పూజలను ప్రస్తుత ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆర్జిత సేవగా మార్చారు.

**మృత్యుంజయునికి ప్రత్యేకాలంకారాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకా భిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం ఉద యం నుంచి వైభవంగా పూజలు నిర్వహించారు. ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామికి అబిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు, గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి హారతులిచ్చారు.

## ఎమ్మెల్సీ భరత్‌చే ఘనంగా ఎంపి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



రాజంపేట ఎం.పి., లోక్‌సభ ప్యానల్ స్పీకర్ పి.వి. మిథున్‌రెడ్డి జన్మదినవేడుకలను సోమవారం చిత్తూరు ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ నేతృత్వంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక క్యా ంప్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. ఎంపి మిథున్‌రెడ్డి మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ భరత్ ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి చైర్మన్ విద్యాసాగర్, పరిశీలకుడు రెడ్డెప్ప,టౌన్‌బ్యాంక్ చైర్మన్ భాగ్యరాజ్, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బంద్

– పలువురు టీడీపీ నాయకులు అరెస్టు

వెదురుకుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



మండలంలో పోలీసుల నీడలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రిమాండ్‌కు నిరసనగా పార్టీ బంద్‌కు పిలుపు నివ్వడంతో నాయకులు, కార్యకర్తలు బంద్ కార్యక్రమంలో పాల్గొని దుకాణాలు, విద్యా సంస్థలను మూసివేశారు. దీంతో వెదురుకుప్పం, పచ్చికాపల్లం, పాతగుంట, దేవళంపేట, మొరవ కూడలిలో వ్యాపారులు దుకాణాలు మూసివేసి సహకరించడంతో పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఐ రమేష్ బాబు కొందరు తెలుగు దేశం పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. బంద్ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి,నియోజకవర్గం మీడియా సమన్వకర్త గురసాల కిషన్‌చంద్, నాయకులు రవి, మొగిలయ్య, నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారుపాళ్యంలో బంద్ ప్రశాంతం

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రిమాండ్‌ను నిరసిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర బంద్ సోమవారం బంగారుపాళ్యంలో ప్రశాంతంగా జరిగిం ది. ఉదయం తెలుగుదేశం నాయకులు బంగారుపాళ్య ంలోని అన్ని దుకాణాలను మూయించారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులను టిడిపి నాయకులు మూసి వేయించారు. జాతీయ రహదారిపై బాబు అరెస్టును నిరసిస్తూ నినాదాలు చేశారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతోందని, అన్యాయంగా తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడును జైలుకు పంపారని ఆరోపించారు. సైకో సిఎం జగన్ పోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్‌గౌడు, ఉపాధ్యక్షుడు కమలనాథరెడ్డి, నాయకులు ఎన్‌పి ధరణినాయుడు, ఎన్‌పి విక్రమ్, హేమచంద్రనాయుడు, రమేష్, గిరిబాబు, శివ, లోకనాథనాయుడు, రాజేంద్రనాయుడు, కృష్ణకుమారి, నాసిర్‌ఖాన్, ఆరీఫ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలసముద్రంలో 'దేశం' నిరసన

పాలసముద్రం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు రిమాండ్‌ను నిరసిస్తూ పార్టీ పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన బంద్ పాలసముద్రంలో ప్రశాంతంగా జరిగింది. రాష్ట్ర దేశం ప్రభావశీలుర గుర్తింపు కమిటీ సభ్యుడు భీమినేని చిట్టిబాబును పోలీసులు గత మూడు రోజులుగా గృహ నిర్బంధంలో వుంచడంతో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం నాయకులు, కార్యకర్తలు బంద్, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం కక్షతోనే తమ పార్టీ అధినేతపై అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపించిందని ఆరోపించారు. నిరసన ప్రదర్శనలో పాల్గొని 12 మంది నాయకులు, కార్యకర్తలు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో శ్రీనురాజు, రవినాయుడు, సత్యశీలన్, ఆరుల్‌నాధన్, సాంబశివన్, తంగరాజ్, శబరివాసన్, అవినాష్, రంజిత్‌కుమార్, జ్ఞానరాజ్, అప్పు తదితరులు వున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తవణంపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



మోటారుసైకిల్‌పై వెళుతూ రోడ్డుకు అడ్డంగా పడివున్న చెట్టును ఢీకొని యువకుడు అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని కె.పట్నం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. సంఘటనకు సంభందించి స్థానిక ఎస్సై సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలావున్నాయి. టీడీపీ నేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా ఇచిన బంద్ పిలుపు నేపథ్యంలో కె.పట ్నంకు చెందిన గోపీ మరికొంత మంది కలసి అరగొండ-చిత్తూరు రహదారిలోని ఐరాల క్రాస్‌సమీపంలో రోడ్డు పక్కనున్న చెట్లును నరికి రోడ్డుకడ్డంగా పడేశారు. ఈవిషయం తెలియని కె.పట్నంకు చెందిన బి.నాగరాజు(26) అనే యువకుడు మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి సుమారు 2.45 గంటలకు తన స్వగ్రామానికి వెళుతూ రోడ్డుపై పడేసిన చెట్టును ఢీకొని అక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతుని భార్య చాందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బంద్ ప్రశాంతం

శాంతిపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

శాంతిపురంలో సోమవారం తెదేపా నేతలు, కార్యకర్తలు చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం దాకా దుకాణాలు మూసేశారు. కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో పలుచోట్ల టైర్లు కాల్చి నిప్పంటించారు. ఎస్సై మునస్వామి మంటలు ఆర్పి గట్టి బందోబస్తు నిర్వహించారు. బంద్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

**వి.కోట :** ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా వి.కోటో దేశం శ్రేణులు బంద్ పాటించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ప్రధాన రహదారిలో దుకాణాలు మూతపడ్డాయి. సిఎం డౌన్‌డౌన్ అంటూ దేశం శ్రేణులు నినాదాలు చేశారు. కొంతసేపు పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. సిఐ లింగప్ప సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

## ఉత్తర బ్రాహ్మణపల్లెలో మామట్టి-మాదేశం

తవణంపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



భారతీయ జనతాపార్టీ ప్రతిష్టాత్మకంగా మామట్టి-మాదేశం కార్యక్రమంను సోమవారం మండలంలోని ఉత్తర బ్రాహ్మణపల్లెలో నిర్వహించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా డిల్లీలో జరిగే ఓ కార్యక్రమం కోసం దేశం నలుమూలల నుండి మట్టిని మామట్టి-మాదేశం కార్యక్రమం పేరిట మట్టిని సేకరించి పంపుతున్నారు. ఈమేరకు ఉత్తర బ్రాహ్మణపల్లెలో గ్రామస్థుల నుండి మట్టిని సేకరించారు. మండల బిజెపీ అధ్యక్షుడు పయని ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వి చంద్రమోహన్, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌చౌదరి, నాయకులు ఆనంద నాయుడు, శ్రీనివాసులు, భరత్ కుమార్, మధన్‌కుమార్, ధనంజయ, కుమార్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఐరాలలో బంద్ ప్రశాంతం

ఐరాల, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో వైకాపా కక్ష్యపూరిత రాజకీయాలకు నిరసనగా టీడీపీ రాష్ట్ర కమిటి ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు పిలుపుమేరకు సోమవారం మండలంలో బంద్ ప్రశాతంగా జరిగింది. ఈమేరకు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరిధిర్‌నాయుడు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు మండలంలోని కాణిపాకం, వైఎస్.గేట్,ఐరాల, పాటూరు సంతగేట్ తదితర ప్రాంతాల్లో దుకాణాలను మూసివేయించి బంద్ పాటించారు. మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. అలాగే ఆయా ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో తెదేపా నేతలకు తీవ్రగాయాలు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



కుప్పం సమీపం సామగుట్టపల్లి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగుదేశం పార్టీ నేతలకు తీవ్రగాయాలయ్యాయి. నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సంక్షేమ కమిటీ కన్వీనర్ త్రిలోక్, లక్ష్మీపురం యువనేత లోకేష్‌లు బుల్లెట్ వాహనంలో వస్తుండగా ఎదురెదురుగా వచ్చిన పాలవ్యాను ఢీకొన్నాయి. దీంతో ఇద్దర్ని స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎంపి మిథున్‌రెడ్డి స్ఫూర్తివంతమైన నేత

–ఘనంగా ఎంపి మిథున్ జన్మదిన వేడుకలు

పుంగనూరు,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



రాష్ట్ర క్రియాశీల రాజకీయాలలో రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి స్ఫూర్తివంతమైన నాయకుడుగా ఎదుగు తున్నారని,ఆయన ఆధ్వర్యంలో యువత ముందుకు పోవాలని రాష్ట్రజానపదకళల అకాడమీ చైర్మన్ కొండ వీటి నాగభూషణం అన్నారు. ఎంపి మిథున్‌రెడ్డి జన్మనదినం సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక మున్సిపల్ బస్టాండులో కొండవీటి అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్‌చేసి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ,స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు వార్డులు,గ్రామాలలో ఎంపి మిథున్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## కాణిపాకంలో ఘనంగా మిదున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



రాజంపేల ఎంపీ, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాణిపాకంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ఆధ్వర్యంలో మండల వైకాపా నాయకులు కాణిపాకం ఆలయంలో మిధున్‌రెడ్డి పేరిట అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే ఆలయం వద్ద ఎమ్మెల్యే, వైకాపా నాయకులు, ఆలయ అధికారులు కలసి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, మాజీ ఎంపీపీ రవిప్రసాద్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, నాయకులు గోపీనాథన్, మూర్తి, ఆలయ ఈఓ వెంకటేశు, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే

కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు వేద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను,ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, స్థానిక వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాణిపాకం దేవస్థానం ప్రధాన ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించి ఆదివారం సంప్రోక్షణ నిర్వహించిన అద్దాలమండపంను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు సందర్శించి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఇన్‌చార్జ్ ప్రధాన ఆర్చకులు సోమశేఖర్‌గురుకుల్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో బంద్ ప్రశాంతం

తవణంపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా చేపట్టిన బంద్ సోమవారం మండలంలోని ప్రశాంతంగా జరిగింది. వైకాపా కక్ష్యపూరిత రాజకీయాలకు నిరసనగా టీడీపీ రాష్ట్ర కమిటి సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది.ఈమేరకు మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. ఉదయం నుండి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను యధావిధిగా నడిచాయి. అలాగే బ్యాంకులు, పాఠశాలలు సైతం పూర్తి స్థాయిలో పనిచేశాయి. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా స్తానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చంద్రబాబు అరెస్టు రాజకీయ కక్ష కాదు

– వైసీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి మొబిన్‌బాషా

కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన ప్రధాన నిందితుడు నారా చంద్రబాబునాయుడికి 14 రోజులు రిమాండ్ విధించడం రాజకీయ కక్ష కానే కాదని వైసీపీ తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ మొబిన్‌బాషా అన్నారు. సోమవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ చంద్రబాబు అడ్డంగా దొరికిపోయి రాజకీయ కక్ష అనడం సరికాదన్నారు. చంద్రబాబుకు పాపం పండిందన్నారు. ఆ రోజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్టు చేసి ఆయన కుటుంబాన్ని నడిరోడ్డుపై కూర్చోబెట్టించారన్నారు. 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అవినీతి జరిగిందని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని సొంత కంపెనీలకు 371 కోట్లు దారి మళ్లించారని చెప్పారు. ఇందులో లోకేష్ హస్తం కూడా ఉందని ఆరోపించారు. సిబిసిఐడి అధికారులు సమగ్రంగా లోకేష్‌ను విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఖర్మ సిద్ధాంతం అందరికీ వర్తిస్తుందన్నారు. చంద్రబాబు అరెస్టును చూసి దత్తపుత్రుడు చాలా బాధపడిపోతున్నాడని, అవినీతికి మద్దతిస్తున్నాడని వీరు నాయకులా అని ప్రశ్నించారు. చట్టం చంద్రబాబు చుట్టం కాదని తేలిపోయిందన్నారు. తప్పు చేస్తే ఒకరోజు కాకపోయినా మరొకరోజు దొరికిపోతారని చెప్పారు.

## కోటలో కనపడని బంద్ ప్రభావం

కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించ డంతో ఆ పార్టీ అధిష్టానం బంద్‌కు పిలుపునిచ్చింది. ఆ మేరకు కోటలో సోమవారం బంద్ చేసేందుకు టిడిపి శ్రేణులు ప్రయత్నించగా, ముందస్తుగానే పోలీసులు నాయకుల ఇళ్లకు వెళ్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో పట్టణంలో యధేచ్ఛగా వ్యాపారులు దుకాణాలను వ్యాపారాలు కొనసాగించారు. ప్రభుత్వ కార్యాలయాలు యధావిధిగా పనిచేశాయి. ఆర్టీసీ బస్సులు నడిచాయి. పోలీసుస్టేషన్‌కు తరలించిన నాయకుల్లో జలీల్ అహ్మద్, తూపిలి రాధాకృష్ణారెడ్డి, మస్తాన్‌బాషా, ఎంపిటిసిలు షంషుద్దిన్, దారా సురేష్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, కందల బాలకృష్ణ యాదవ్, బాబు, నాయబ్ రసూల్ తదితరులు ఉన్నారు.

## కోటలో అన్నదానం

కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపు లేటి కిషోర్ జన్మదినాన్ని పురస్కరించు కొని సోమవారం కోటలోని వినాయక స్వామి గుడిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. 150 మందికి అన్నదానం చేశారు. రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు రోటరీ అధ్యక్షుడు జిమ్మి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, పెల్లేటి గోపాల్‌రెడ్డి, వంశీ, రవి, వర్మ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈవోపీఆర్‌డిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు

బాలాయపల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

ఈవోపీఆర్‌డీగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు డీపీవో కార్యాలయం నుండి ఆయన పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## 12 దాటినా జీతాలు అందలేదు

కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులకు 1వ తేదీన జీతం పగటికలగానే మిగులుతోంది. రెండేళ్ల నుంచి ఈ సమస్యల జటిలంగా తయారైంది. ప్రస్తుతం ఆగస్టు నెల జీతం ఇప్పటికే అందని దయనీయ స్థితి నెలకొంది. ప్రత్యేకంగా ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్షకట్టినట్లు మరోసారి రుజువైందని ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇతర సమస్యల కథ దేవుడెరుగు అసలు జీతం ఇవ్వడమే గగనమైంది. 11వ తేదీ దాటినా ఇప్పటికీ జీతాలు జమ కాలేదు. సాంకేతిక కారణాలు చూపుతూ మొండిచేయి చూపుతున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. బుధవారం జీతాలు జమ అవుతాయని ఎంఇఓ మస్తానయ్య పేర్కొన్నారు.

## రాష్ట్రంలో శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు లేదా

– నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయినయందని, శాంతియుతంగా కూడా నిరసనలు తెలియజేయలేని దుస్థితి ఏర్పడి ఉందని సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన టిడిపి నాయకులను అరెస్ట్ చేయడంతో వారికి మద్దతుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న వారు విలేఖరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు నిరసన తెలియజేస్తే వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ లేనివిధంగా మూడురోజుల పాటు టిడిపి నాయకులను గృహ నిర్బంధం చేయడం ఎన్నడూ చూడలేదన్నారు. కనీసం శాంతియుతంగా నిరసన తెలియజేసే పరిస్థితి కూడా రాష్ట్రంలో లేదని, ఇది ఎంతో దౌర్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అభివృద్ధితో పోటీ పడలేక చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు

– మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి పోటీ పడలేక సీఎం జగన్మోహన్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టించారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. చంద్రబాబునాయుడిని అక్రమ కేసులు ఏమీ చేయవలేవన్నారు. జగన్మోహన్‌రెడ్డి జైలులో గడిపారు కనుక చంద్రబాబునాయుడును కూడా జైలుకు పంపాలని కక్షతో పంపారని విమర్శించారు. దేశంలో ఉన్న నీతి నిజాయితీ కలిగిన కొద్ది మంది నాయకుల్లో చంద్రబాబునాయుడు ఒకరని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసిన చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించినట్లు తెలిపారు. తాను కూడా ఎమ్మెల్యేగా 10 సంవత్సరాలు చేశానని, అభివృద్ధితో పోటీ పడ్డానే తప్ప అరాచకాలతో పోటీ పడలేదన్నారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ప్రజలు వైసీపీ చేస్తున్న అరాచకాలను గమనిస్తున్నారన్నారు. వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## 144 సెక్షన్ ధిక్కరిస్తే చర్యలు

బాలాయపల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

బంద్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరైనా ఆందోళన చేపడితే చర్యలు తప్పవని ఎస్ఐ వీరనారాయణ హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ బంద్‌కు పిలుపునిచ్చిన సందర్భంగా ఆ పార్టీ నాయకులను గృహనిర్బంధం చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరు గుంపులుగా తిరగరాదని సూచించారు. దుకాణాలు మూయించి వాహనాలు ఆపితే చర్యలు తప్పవన్నారు. మండలంలో పాక్షికంగా బంద్ జరిగింది.

## చంద్రబాబు అరెస్ట్ అన్యాయం

పెళ్లకూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



ఏ తప్పు చేయని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి రిమాండుకు పంపించారని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ కందమూడి శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామంలో శివకుమార్‌ను ఆయన నివాసంలో సోమవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాలుగేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రజల దృష్టిని మళ్లించాలని విమర్శించారు. సోమవారం తెల్లవారుజామున మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బంద్‌కు సన్నద్ధమవుతుండగా, నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని సంచి కృష్ణయ్యను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. చిల్లకూరు వడ్డిపాలెంజాతీయరహదారిపైసీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కలవకూరు మునీష్ తదితరులు నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదు

– మాజీ ఏఎంసీ చైర్మన్ సి.సి.నాయుడు

బాలాయపల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని మాజీ ఏఎంసీ చైర్మన్ సి.సి.నాయుడు తెలిపారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడుఅరెస్టుకునిరసనగా వెంగమాంబపురం గ్రామంలోవిద్యాసంస్థలనుమూయించిబంద్ నిర్వహించారు గ్రామంలోని దుకాణాలు మూయించారు. చంద్రబాబు నాయుడుపై సీఎం జగన్మోహ న్‌రెడ్డి కక్షతో అక్రమ కేసులు పెట్టినట్లు తెలిపారు. వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. చంద్రబాబు నాయుడు కేసుల నుండి బయటపడతారన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారం లోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలోటీడీపీ నాయకులుశ్రీనివాసులు, రాజగోపాల్ నాయుడు, నారాయణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నకు లక్ష్మణుడుగా ఎంపీ మిధున్‌రెడ్డి

– ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

రామాయణంలో శ్రీరామచంద్రుడికి తోడుగా లక్ష్మణమూర్తి ఎలా వున్నారో వైఎస్ఆర్‌సిపిలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అన్ని విధాల తోడుగా ఎంపీ మిధున్‌రెడ్డి వున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం బంగారుపాళ్యంలో రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి 47వ జయంతిని జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో ఎంపీ మిధున్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం వైఎస్ జగనన్నకు కష్టనష్టాల్లో తోడు నీడగా ఎంపీ మిధున్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు.


**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL: AT HYDERABAD-II**
**MA No. 21 OF 2020**
**in**
**O.A.NO. 218 of 2019**

Between:
**M/s Sapthagiri Grameena Bank,** Rep. by General Manager M Vijaya Bhaskara Rao, S/o M Murali Mohan Rao, Age: 59 years, Occ.: General Manager, O/o Sapthagiri Grameena Bank Head Office, Chittor **...Petitioner/Applicant**

And

1. **Bestha Bhagyamma,** W/o B Ananda, Age: 40 years, Occ: house wife, H.No. 24-48-30/2, C/o Manjuatha Kalyana mandapam, Bye pass Road, Punganur- 517247 Chittor District.
2. **Bestha Kishore** S/o late B Ananda, Age: 20 years, Occ: Student, H.No. 24-48-30/2, C/o Manjuatha Kalyana Mandapam, Bye pass Road, Punganur - 517247 Chittor District.
3. **M/s Sri Dwarakamal Rural Godown,** Gurudupally, Palamaner Road, Punganur Road, Chittor District- 517247.
4. **Rachamadugu Deepa** W/o Royal Kumar, Age: 39 years, Occ: house wife, Police line, Punganur-517247 Chittor District.
5. **Rachamadugu Shobha Rani** D/o Gopinath, Age: 43 years, Occ: house wife, D.NO.22-81/1, Bazar street, Palamaner-517408 Chittor District.

**...Respondents/ defendants**

**NOTICE**

In the above case the Petitioner have filed restoration Petition to retore O.A.No. 218/2019 which was dismissed for default on 08.01.2020. As per orders of the Honourable Tribunal Notices sent you are un-served as such the Honourable Tribunal orders to publish notice by way substitute service. Please take notice that the above case is posted to for your appearance and counter if any 30.11.2023 otherwise you will be set exparti.

This notice is given as per orders of the Honourable Tribunal

**Sd/- B. PRABHAKAR RAO**
**Advocate**
Flat No.207, Malik Chambers, Hyderguda Main Road, Hyderabad-500049,
**Mobile: 9989492907**

## గంగమ్మకు టీటీడీ సారె మంజూరు

నగరి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:
నగరి గంగమ్మజాతర టీటీడీ సారె మంజూరైంది. ఈ మేరకు ఈ నెల 5వ తేదీ ఆర్‌వోసీ నెంబరు 12021(73)52/2023 మేరకు టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి సి.గుణభూషణరెడ్డి నుంచి ఆదేశాలు అందాయి. టీటీడీ సారెను గంగమ్మకు అందించాలన్న గ్రామ పెద్దలు, జాతర నిర్వాహకుల కోరికను మంత్రి రోజా వారం రోజుల్లో పరిష్కరించారు. దీంతో జాతర నిర్వాహకులు మంజూరైన సారెను అందుకునే ప్రక్రియలో భాగంగా సంబంధిత వివరాలతో టీటీడీ అధికారులను సోమవారం వెళ్లి కలవడం జరిగింది. ఈ నెల 12,13 తేదీల్లో జరిగే గంగజాతరలోనే టీటీడీ సారె అందనుంది. వెను వెంటనే శ్రీవారి కానుకలను గంగజాతరకు అందిచినందుకు మంత్రికి జాతర నిర్వాహకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మిట్ట కండ్రిగలో శ్రీకృష్ణ జయంతోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ప్రబోధ సేవా సమితి కమిటి సారథ్యంలో సోమ వారం శ్రీకృష్ణ జయంతోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. శ్రీకృష్ణుని విగ్రహానికి అంగరంగవైభవంగా ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమాల్లో కమిటి సభ్యులు సి. సుబ్రమణ్యం, జి.పెంచులయ్య, జి.సుధ, సి.వెంకటలక్ష్మీ, జె.శ్రీనివాసులు, జె.చామంతి, సి.రాజేష్, సి.లక్ష్మీ, బి.సురేష్ యాదవ్, కే.ధనంజయులు కే.రంగయ్య, కే.శ్రీదేవి, కే.ధనంజయ, కే.హరిత కె.అనూరాధ, సి.మధుసూధన్, సి.లాలూ ప్రసాద్, జి.జయసుధ, బి.ఉదయ్‌కిరణ్, ఎం.మస్తాన్, ఎం.రాహుల్, ఎం.యాసినా, ఎం.పర్విన్, జే లీలా కృష్ణ పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

## ఈటిసిలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

తొట్టంబేడు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



పంచాయతీ కార్యదర్శులకు 17 అంశాలకు సంబందించిన పరిపాలన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఏపిఎస్ఐఆర్టీ డైరెక్టర్, ఐఎఎస్ అధికారి మురళీ అన్నారు. శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులుకు పంచాయతీరాజ్ వ్యవస్థపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన సుమారు 300మంది పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతివెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ నాగపద్మజ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు ప్రజలకు గ్రామకంతాలు, రిజిస్ట్రేషన్లు, గ్రామాల పరిధిలో ఉన్న లేఅవుట్లకు పన్నులు విధించడం, ఏపిఎస్ఐఆర్టీ డైరెక్టర్, ఐఎఎస్ అధికారి మురళీ సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలుకు సంబందించి సమగ్రంగా వివరించారు. పంచాయతీ అనుమతి లేని లేఅవుట్‌లను గుర్తించాలని కార్యదర్శులకు సూచించారు. పంచాయతీరాజ్ చట్టాన్ని సర్వే చేసి రిజిస్ట్రేషన్ చేయాలి, గ్రామాల్లో లేఅవుట్‌లకు అనుతులు ఇవ్వడం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1 నుంచి 5 వరకు, ఈటిసి సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడును కేసులతో వేధించడం తగదు

.తొట్టంబేడు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కేసులతో వేధించడం తగదని మండల పార్టీ అధ్యక్షులు గాలిమురళీనాయుడు అన్నారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర బంద్ పిలుపు మేరకు తెలుగుదేశంపార్టీ నాయకులైన తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షులు గాలిమురళీనాయుడును గత మూడు రోజుల నుంచి గృహనిర్బంధం చేయడం అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావడం తెలిసిందే. ప్రజాస్వామ్యప్రభుత్వంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ఆయన ప్రశ్నించారు. కాగా తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర ఐదుమందికి నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు చింతపట్ల భాస్కర్‌నాయుడు, మాజీ వైస్‌ఎంపిపి చంద్రారెడ్డి, తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నెలబల్లిసునీల్, బిసి సెల్ నాయకులు సురేంద్రయాదవ్ మరియు తాతయ్య, మాజీ ఎంపిటిసి సింగమాల భాస్కరయ్య, కన్నలిరత్నయ్య, రైతు నాయకులు భాస్కర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఘట్టమనేని శంకరనాయుడు, వాణిజ్య విభాగం అధ్యక్షులు శేషంనాయుడు, సాలిరాజ, కమల్‌నాథ్, రామచంద్రనాయుడు, మహిళా నాయకురాలు సరోజనమ్మ, బాలిశెట్టిమోహన్, మురళీ, శివకుమార్, కరీముల్లా, భాష, సుబ్రమణ్యం, చలపతి, మరియు బాలాజీ, రఘురామయ్య, గుర్రప్ప, సురేష్, పెంచలయ్య, కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 8మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



ఆదివారం స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తెలుగుదేశంపార్టీ నాయకులను టుటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈనేపధ్యంలో ఆదివారం సాయంత్రం పోలీసులు, తెలుగుదేశంపార్టీ నాయకులకు వాగ్వివాదం చోటుచేసుకోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కుర్చీలు విరిగిపోయాయి. దీంతో సిసి కెమెరాల ద్వారా పరిశీలించిన పోలీసులు తెలుగుదేశంపార్టీనాయకులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి మాజీ మార్కెట్‌కమిటీ రంగినేని చెంచయ్యనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి, పట్టణప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, సుజిత్, వినయ్, కృష్ణమనాయుడు, కృష్ణయాదవ్, వి.బాలాజీలు ఉన్నారు. సోమవారం సాయంత్రం వీరిని పోలీస్‌స్టేషన్ నుంచి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్ళి వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపరచారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. రూరల్ సిఐ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్ఐ విజయకుమార్‌నాయక్ ఆధ్వర్యంలో కోర్టుకు తరలించారు.

## హౌస్ అరెస్టులు-పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

తొట్టంబేడు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



చంద్రబాబునాయుడు అరెస్టుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం కూడా పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకునిపోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈనేపధ్యంలో రెండు రోజుల పాటు హౌస్‌అరెస్టులో ఉన్న పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, యువత నాయకుడు గుత్తావిజయకుమార్, గోపి తదితరులను అదుపులోక తీసుకుని టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉషను ఇంటిలోనే మహిళా పోలీసులు నిర్బందించారు. ఆమెతో పాటు పలువురు తెలుగుమహిళలను అదుపులోకి తీసుకున్నారు. కాగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటతో పాటు ఆమె భర్త చంద్రబాబులను హౌస్ అరెస్టుచేశారు.

## సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలి

కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని కమిషనర్ హరిత అన్నారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో కమిషనర్ హరిత అర్జీలను స్వీకరించగా, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొన్నారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి 10 పిర్యాదులు, స్పందన కార్యక్రమానికి 19 ఫిర్యాదులు వచ్చాయి. 41వ డివిజన్ కార్పొరేటర్ స్రవంతి వ్రాత పూర్వకంగా డివిజన్‌లోని సచివాలయ అమినేటి సెక్రటరీ సరిగా విధులు నిర్వహించడం లేదని, ప్రజా పిర్యాదులను పట్టించుకోవడం లేదని స్పందన పిర్యాదుపై కమిషనర్ హరిత స్పందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందనే విషయాన్ని సచివాలయ సిబ్బంది గుర్తించుకుని విధులు నిర్వహించాలని సూచించారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతు మాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు, సూపరింటెండెంట్‌లు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అవనాక్షమ్మ అమ్మవారి జాతర

నారాయణవనం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



మండలంలోని సమదాయం గ్రామంలో వెలసిన అవనాక్షమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఈనెల నేడు మంగళవారం నుంచి నాలుగురోజుల పాటు నారాయణవనం మేజర్ పంచాయతీ 1,2,3,4 వార్డులకు చెందిన సెంగుంధర్‌మొదలియార్(పెద్దకచ్చీ) కులస్తుల వారి ఆధ్వర్యంలో అవనాక్షమ్మ అమ్మవారి జాతరను నిర్వహించారు. గత వారం టిటిడి ఆధ్వర్యంలో ఈ జాతరను నిర్వహించారు. ఈ వారం టిటిడి అధికారులకు స ంబంధం లేకుండా అమ్మవారిని గ్రామస్తులు ఒక్కొరోజు ఒక్కో వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించనున్నారు. దీనికోసం కీళగరం జంక్షన్‌లోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపుల విద్యుత్‌తోరణాలు, అమ్మవారి విద్యుత్ కటౌట్లు, ఆర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

## ముందస్తు గృహనిర్బంధాలు .. టిడిపి బంద్ ప్రశాంతం

చంద్రగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



ముందస్తు గృహనిర్బంధాలతో టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నప్పటికీ తమ నిరసన కార్యక్రమాలను నిర్వహించడంలో సక్సెస్ అయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం చంద్రగిరి మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల్లో చంద్రబాబు పట్ల పెల్లుబికుతున్న అభిమానంతో 2024 సార్వత్రిక ఎన్నికలలో టిడిపి విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. అనంతరం ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా, చంద్రబాబుకు అనుకూలంగా నినాదాలు చేస్తూ టిడిపి నాయకులు టవర్ క్లాక్ వద్ద ధర్నా నిర్వహించారు. చంద్రగిరి పట్టణంలో దుకాణాలు, పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను ఆందోళనకారులు మూసివేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొందూరు ప్రవీణ్ రాయల్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, పట్టణ అధ్యక్షుడు కాపువీధి సునీల్, ప్రభాకర్ నాయుడు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వత్తిడిని జయించడంతోనే ఆత్మహత్యల నివారణ

మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్

చంద్రగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



నిన్ను నమ్ముకున్న వారిని అనాధలుగా మార్చగలిగేది నీ ఆత్మహత్య మాత్రమేనని మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మహత్యలు ధనవంతులలో 20 శాతం, పేద మధ్య తరగతి కుటుంబాలలో 80 శాతం నమోదవుతున్నట్లు తెలిపారు. మానసిక వత్తిడి, మానసిక ఆందోళన, ఇతరులతో తమను పోల్చుకోవడం వంటి కారణాలతో పాటు ఆత్మహత్య కారక మందులు సులభంగా లభించడం కారణమన్నారు. అంతకు ముందు ఎస్వీ మెడికల్ కళాశాల ఎస్.పి.ఎం.డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ వత్తిడికి గురైన సమయంలో ఆత్మీయ స్నేహితులతో మాట్లాడటం, మంచి పుస్తకాలను చదవడం ద్వారా వత్తిడిని జయించవచ్చన్నారు. సమస్యలు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదురించి మనం ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాజల్, స్కూల్ హెచ్ఎం విజయ, డాక్టర్ రేవతి, హెల్త ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్‌వైజర్ ప్రమీల, నారాయణరాజు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పద్మావతీ నర్సింగ్ స్కూల విద్యార్థినులు, స్కూ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అరాచక ప్రభుత్వాన్ని తరిమి కొడదాం..!

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



రాష్ట్రంలోని అరాచక ప్రభుత్వాన్ని రానున్న సార్వత్రిక ఎన్నికలలో తరిమికొడదామని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం రామచంద్రాపురం కూడలిలో ధర్నా చేశారు. బ్యాంకులు, పాఠశాలలు, షాపులను మూసివేయించి బంద్ నిర్వహిస్తూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్‌చౌదరి, కోరాహరిప్రసాద్, రవి, గిరిధర్ రెడ్డి, రావిళ్ళ గిరి, ఉమాపతి నాయుడు, వసంత నాయుడు, సురేంద్ర నాయుడు, సోమ రాయల్, జనసేన మండల అధ్యక్షుడు సంజీవి హరి, నాయకులు రెడ్డెప్ప , రఘు, చరన్, పాల్గొన్నారు.

## టిడిపి బంద్ పిలుపు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు

టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని

చంద్రగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో బంద్‌కు స్వచ్ఛంధంగా సహకరించిన ప్రజలందరికీ టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ప్రజలు దుకాణాలు మూసివేయడంపై కొందరు వైసిపి నాయకులు బలవంతంగా షాపులు తెరవాలన్నట్లు తెలిసిందన్నారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో రాష్ట్రానికి, దేశానికి ఎంతో సేవ చేసిన మాజీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయించడం ద్వారా జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నట్లు దుయ్యబట్టారు. ప్రజాభిమానంతో ఎంతో మంది ఎన్నికలలో కొట్టుకుపోయారన్నారు. ప్రజల అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు.

## డిఆర్‌ఓ పెంచల కిషోర్‌ను సన్మానించిన విఆర్‌ఓల సంఘం

చంద్రగిరి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా డిఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టిన పెంచల కిషోర్‌ను సోమవారం విఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఇందులో భాగంగా విఆర్‌ఓల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బాలాజీ రెడ్డి, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమంత్, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు చెంగ్రాయులు, గూడూరు డివిజన్ అధ్యక్షుడు రమణయ్య, శ్రీకాళహస్తి డివిజన్ ప్రధాన కార్యదర్శి నెన్నూరు చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకళ, నల్లయ్య, రాష్ట్ర ఈసి సభ్యుడు నారాయణ, విఆర్‌ఓల సంఘం నాయకులు డిఆర్‌ఓను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి హార్థిక స్వాగతం పలికారు.

## పన్నూరు - పిళాసపాలెం రోడ్డుకు మంత్రి భూమి పూజ

విజయపురం, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :



మండలంలోని పన్నూరు – పిళాసపాలెం రోడ్డు నిర్మాణానికి పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా సోమవారం భూమి పూజ చేశారు. ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులు రూ. 29 కోట్లతో 5.1 కిలోమీటర్ల మేరకు ఈ రోడ్డును నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల నుంచి రోడ్డు దుస్థితిలో వుందని, నిర్మాణం పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందన్నారు. రోడ్డుకు భూమి పూజ చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఇ సుబ్బారాయుడు, ఎంపిడిఇ ప్రసాద్, పిఆర్ ఎఇ వీరభద్రం, నగరి నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు హరిబాబు నాయుడు, ఎంపిటిసి రాజగోపాల్, నాయకులు మనోహర్‌రెడ్డి, వెంకటేశులు, జిల్లుదాసు, కుమార్‌రెడ్డి, బాబు, సుధాకర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి అడ్రస్ గల్లంతవుతుంది

గాలి భానుప్రకాశ్

పుత్తూరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :



రాష్ట్రానికి 14 సంవత్సరాలు పాటు ముఖ్యమంత్రి గా సేవలందించిన చంద్రబాబునాయుడు పట్ల వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరిస్తోం దని, ఆయన అక్రమ అరెస్టు నేపథ్యంలో వైసిపి ప్రభుత్వ అడ్రస్ గల్లంతైనట్టేనని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. సోమవారం తిరుపతిలో గృహ నిర్బంధంలో వున్న ఆయన కాపలాగా వున్న పోలీసులను తప్పించుకుని ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు చేరుకున్నారు. అనంతరం స్థానిక ఆర్టీసి బస్టాండ్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ టిడిపి శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు కోట్ల ప్రజలు చంద్రబాబునాయుడుతోనే వున్నారన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్టు చేసినందుకు వైసిపి నాయకులు సిగ్గు లేకుండా సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. 16 నెలలు జైలులో వున్న జగన్మోహనరెడ్డి ఆ మరకను అందరికీ అంటించాలనుకుంటున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నింద్రలో టిడిపి ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతం

నింద్ర, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంపై జాతీయ టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకి ఎసిబి కోర్టు 14రోజులు పాటు రిమాండ్ విధించడంపై రాష్ట్ర టిడిపి ఇచ్చిన పిలుపుపై నింద్ర మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర టిడిపి యస్‌సి సెల్ ఉపాధ్యక్షులు ధశరద వాసు ఆధ్వర్యంలో సోమవారం బంద్ జరిగింది. చంద్రబాబునాయుడు రిమాండ్ నిరసనగా నెట్టేరి రోడ్డులో టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నింద్ర యస్ఐ శివశంకర్ టిడిపి నాయకులను, కార్యకర్తలను హౌస్ అరెస్టు చేసారు. తరువాత సాయంత్రానికి సొంతపూచికత్తుతో విడిచిపెట్టారు. ఈకార్యక్రమంలో మాజీ టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయుడు, కుప్పానాయుడు, నాయకులు రవినాయుడు, ఎజె రవికుమార్, రమేష్, బాబుయాదవ్, జగన్, విజయకుమార్, దినకర్, దయాళ్, ఆనంద్, యబిరాజ్, నాగరాజ్, జయచంద్రనాయుడు, గంగధర్‌నాయుడు, కోటీశ్వరరావు, ప్రశాంత్‌కుమార్, దేవన్, క్రిష్ణయ్య, దేవనేషన్, మురళీనాయుడు, ఆనంద్, పరదేశి పాల్గొన్నారు.

## రేణిగుంటలో బంద్ పాక్షికం...

టీడీపీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రేణిగుంట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిక్షనేత చంద్రబాబునాయుడు రిమాండ్‌కు నిరసనగా పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బంద్ రేణిగుంట మండలంలో శనివారం పాక్షికంగా జరిగింది. ఆర్టీసీ బస్సులు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు బంద్ కారణంగా సేవలు అందించలేకపోయాయి. కొంత మంది వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసేశారు. బంద్ వల్ల ప్రజా జీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉండడం వల్ల ముందస్తు చర్యల్లో భాగంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. రేణిగుంట తహసీల్దార్ ఉదయసంతోష్ మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు ప్రకటించారు. ఉదయమే టీడీపీ నేతలు రేణిగుంట పట్టణంలో ర్యాలీ నిర్వహించిన నిరసన తెలియజేశారు. గాంధీ బొమ్మ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అర్బన్ సీఐ సుబ్బారెడ్డి శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రత్యేక పోలీసు బలగాలను పిలిపించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టీడీపీ నేతలను తమ సీఐలు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్ఐ ఈశ్వరయ్య తమ సిబ్బందితో అడ్డుకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉందని టీడీపీ నేతలకు తెలిపారు. నేతలకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, జిల్లా టీడీపీ నేతలు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామి నాయుడు, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, పార్టీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, అడ్వకేట్ ఉదయకుమార్‌రెడ్డి, కొరియర్ రవి, గజేంద్రరెడ్డి, బుజ్జినాయుడు, భాస్కర్‌రెడ్డి, దేవెల్ల రమణ, ఎస్సీ నాయకులు నెల్లూరు సుబ్రహ్మణ్యం, ఉన్నారు.

## రక్షణ ట్రస్టు ద్వారా మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రేణిగుంట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:



ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు రేణిగుంట రేణిగుంట మండలంల సోమవారం రక్షణ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ బాల ఘనంగా నిర్వహించారు. మల్లవరం ఎస్టీ కాలనీలో పేదలకు ఆయన బట్టలు పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి అందరికి పంచారు. ఈ సందర్భంగా బాల మాట్లాడుతూ మిథున్‌రెడ్డి మచ్చలేని నాయకుడు అన్నారు. ఆయన పుట్టిన రోజు నిరుపేదల మధ్య జరపడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి పుట్టిన రోజులు ఎన్నో జరుపుకోవాలని బాల ఆకాంక్షించారు.

## జనసైనికులను అక్రమ అరెస్టులు చేయడం దారుణం

-పోలీసుల తీరుపై జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి మండిపాటు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



నారాచంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా శాంతియుతంగా టిడిపి నేతలు చేస్తున్న బంద్‌లో తమ జనసైనికులు పాల్గొని మద్దతు తెలిపినందుకు తమను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం దారుణమని జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు అరెస్ట్ నిరసనగా టిడిపి నేతలు సోమవారం రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు చంద్రబాబు అక్రమ అరెస్టుకు పూర్తి మద్దతు తెలుపుతూ జనసైనికులు బంద్‌లో పాల్గొనడం జరిగింది. అయితే వారు చేస్తున్న నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేస్తూ పోలీసులు నాయకులందరినీ బలవంతంగా అరెస్ట్ చేసి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ చేయబడిందని, శాంతి భద్రతలు గాలికెగిరిపోయాయని ధ్వజమెత్తారు. పోలీసులు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మరచి, జగన్ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ప్రజల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ కాబడిన వారిలో జనసేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆకేపాటి సుభాషిణి, నాయకులు రాజేష్ ఆచారి, పార్థు, మునస్వామి, లక్ష్మి, నరసమ్మ, రుద్ర కిషోర్, సాయిదేవ్, శిరీష, హేమంత్‌కుమార్, బాషా, హిమవంత్, కొండా రాజమోహన్, బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టు పూర్తిగా వైసీపీ కుట్ర

- జ్యోతినాయుడు

నగరి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు చాలా దారుణమని నగరి పట్టణ తెలుగుదేశం పార్టీ తరపున నాయకులు ఇంటి వద్దనే మౌన పోరాటంచేస్తూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జ్యోతినాయుడు మాట్లాడుతూ ఈ రోజు భారతదేశంలో ఒక్క అత్యున్నతమైన స్థానంగా మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన మహా నాయకుడు చంద్రబాబునాయుడు. ఆయనపై కక్ష సాధింపుతో లేనిపోని అక్రమ కేసులు పెట్టి ఆయన అరెస్టు చేయడం చాలా దారుణమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుణశేఖర్, చిన్నింటి వెంకటేష్, ఎస్.ఎస్.కుమార్, వెంకటముని, చిట్టివెంకటేష్, ఎల్.టి.ఎస్.రాజా, సుందర్‌రాజు, సోము, తులసిపాల్గొన్నారు.

## నాయకులు హౌస్ అరెస్టు.. బంద్ ప్రశాంతం

వడమాలపేట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా చేపట్టిన బంద్ సోమవారం వడమాలపేట మండలంలో ప్రశాంతంగా ముగిసింది. పార్టీనాయకులను ముందు జాగ్రత్తగాపోలీసులు హౌస్ అరెస్టు చేశారు. వడమాలపేటలో బంద్ వాతావరణం కనిపించింది. విద్యా సంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసి వేశారు. వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు. సాయంత్రం టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

## వైకాపా ఏపీని బీహార్‌గా మార్చింది

టిడిపి నాయకులు ఆగ్రహం

తిరుపతి (మహిళవర్సిటీ), సెప్టెంబరు 11 ప్రభాతవార్త:



వైసిపి అధినేత సీఎం జగన్మోహన్ రెడ్డి కక్షపూరిత పాలనతో ఆంధ్రప్రదేశ్‌ను బీహార్ రాష్ట్రంగా మార్చారని, టిడిపి తిరుపతి పార్లమెంట్ స్పోక్స్ పర్సన్ ఓట్ల సురేందర్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ బీసి సెల్ అధ్యక్షుడు రుద్రకోట సదా శివమ్‌లు ఆగ్రహం వ్యక్తం చేసారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు టిడిపి నాయకులు సుధాకర్, వడ్డెర సంఘం శ్రీరాములు, అశోక్, శంకర్, ధనంజయ్, ఉదయ్ , వెంకీ, రామ్మూర్తిలతో పాటు ఎమ్మార్పీ ఎస్ నాయకులు రాధాకృష్ణ, తురక అమర్నాథ్ తదితరులతో కలిసి వీరు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న తీవ్ర పరిణామాలు చూస్తుంటే మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అరెస్టు, రిమాండ్‌లు వైసిపి స్క్రిప్టును ప్రభుత్వ అధిష్ఠానం ఫాలో అవుతున్నట్లు అర్థమవుతుందన్నారు. మొదట 37వ ముద్దాయిగా చంద్రబాబును చూపి, చివరిగా మొదటి ముద్దాయిని చేసి జైలుకు పంపడం, సిఎం జగన్ కక్ష సాధింపు చర్యగా దుయ్యబట్టారు. జగన్ బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య వెనుక ప్రధాన సూత్రదారి ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. కానీ ఎందుకు అవినాష్ రెడ్డి వెనక ప్రధాన సూత్రధారిని అధికారులు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి రోజా రోడ్లపై స్వీట్లు తినిపించి, డాన్సులు వేస్తూ సంబరాలు చేస్తుంటే పోలీసులు ఎందుకు ఆపలేదన్నారు. చంద్రబాబు అరెస్టుకు సానుభూతిగా శాంతియుతంగా సానుభూతి తెలియజేస్తుంటే, టిడిపి నేతల్ని అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. తమను ఎన్ని ఇబ్బందులు పెట్టినా తాము చంద్రన్న పక్షానే ఉంటామని ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగమని హెచ్చరించారు.

# సూళ్లూరుపేటలో టిడిపి నిరసన దీక్షలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ బంద్‌కు పిలుపు నిచ్చి టిడిపి శ్రేణులు బంద్ చేయాలని ప్రయత్నించినా పోలీసుల బందోబస్తుతో నిరసన దీక్షలకు పరిమితం అయ్యారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున వచ్చిన నాయకులు, కార్యకర్తలు బంద్ చేసేందుకు ఉపక్రమించినప్పటికీ నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐలు రవికుమార్, మనోజ్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి, శేఖర్ తదితరులు తమ సిబ్బందితో పార్టీ కార్యాలయానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిమితం చేశారు. 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరూ చట్టాన్ని అతిక్రమించి బంద్ చేసేందుకు సాహసించినా అరెస్టు చేస్తామని నేతలను హెచ్చరించారు. ఒకవైపు టిడిపి నేతలు ఎలాగైనా బయటకు వెళ్లి బంద్ చేయాలని ప్రయత్నించినప్పటికీ పోలీసులు అడ్డుకొని యధావిధిగా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను కొనసాగించే ఏర్పాటు చేశారు. మాజీమంత్రి పరసా రత్నం గత రెండురోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షను సోమవారం కొనసాగించారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో పరసా రత్నంతో పాటు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉయ్యాల ప్రవీణ్, టిడిపి కార్యాలయం వద్దకు వచ్చి దీక్షలో కూర్చొని సంఘీభావం ప్రకటించారు. టిడిపి పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాళ్లు, మెస్ రమణయ్య, అలవల శ్రీనివాసులు, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక గుండెపోటుతో వీరాభిమాని మృతి

పెద్దపంజాణి సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం పట్ల తీవ్రఆందోలనకు లోనైన తెలుగుదేశంపార్టీ వీరాభిమాని ఆదివారం రాత్రి టివీ చూస్తూ ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. అతన్ని కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటన సంబందించి స్థానికులు, కుటుంబీకుల కథనం మేరకు వివరాలిలా.. పెద్దపంజాణి మండలంలోని మాధనపల్లె పంచాయతీ కత్తార్లపల్లికి చెందిన శంకరప్ప(50) తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, నాయకులు. రెండురోజులుగా చంద్రబాబు అరెస్టుపై జరిగిన పరిణామాలు చూస్తూ తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ఆధివారం రాత్రి చంద్రబాబు అరెస్టును టివీలో వీక్షిస్తూ మరింత ఆవేదనకు లోనై ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబీకులు శంకరప్పను హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శంకరప్ప మృతిపట్ల మండలంలోని తెలుగుదేశం నేతలు ఆయన పార్థివదేహానికి పార్టీజెండాను కప్పి తమ సంతాపాన్ని తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని వ్యక్తపరిచారు.



పార్టీజెండానుకప్పి సంతాపం తెలుపుతున్న తెదేపా

# మర్డర్ కేసుల్లో నిందితులు దర్జాగా ... ప్రజా సేవకుడు జైల్లోనా?

**-నల్ల బెలూన్స్‌తో ఎస్‌సివి నాయుడు నిరసన**



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : మర్డర్‌కేసుల్లో నిందితులు దర్జాగా రోడ్ల మీద తిరుగుతుంటే జగనన్న పాలనలో ప్రజా సేవకులు జైళ్ళకు వెళ్ళాల్సి రావటం బాధాకరమని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం పార్టీ అధిష్టాన వర్గం బంద్‌కు పిలుపు ఇవ్వటంతో పోలీసులు మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడును ఆయన అనుచరులను గృహనిర్బంధం చేసారు. దాంతో ఆయన తన నివాసంలోనే నల్లబెలూన్స్‌తో నిరసన తెలిపారు. తన గ్రాఫ్ పడిపోతుందని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఏమి చేయాలో పాలుపోక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఎస్‌సివి నాయుడుధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామా? లేక నియంతృత్వ పాలనలో ఉన్నామా? అర్థం కావటం లేదని విమర్శించారు. మర్డర్ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయలేని వ్యవస్థలు ముఖ్యమంత్రి మెప్పు కోసం తప్పుడు కేసులతో ఓ విజన్‌గల నాయకుని అరెస్టుకు అత్యూత్సాహం చూపటం గమనిస్తే అత్యంత దారుణమన్నారు. ఒక్క నాయకుని సంతృప్తి పరచుటకు అధికారులు, పోలీసు, సిఐడి వ్యవస్థ అధికారులు చూపుతున్న అత్యూత్సాహం గమనిస్తే ఆశ్చర్యమేస్తుందన్నారు. మూడు రోజుల పాటు తనను గృహ నిర్బంధం ప్రజల కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ హక్కు అయిన నిరసన వ్యక్తం చేయకుండా చేస్తున్నారని తామేమైనా టెర్రరిస్టా అని ఎస్‌సివి నాయుడు ప్రశ్నించారు. చంద్రబాబునాయుడుపై బనాయించిన తప్పుడు కేసులను ఎత్తి వేసి విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు నారాయణయాదవ్, భాస్కర్‌నాయుడు, బత్తెయ్య, శేఖర్ చెంచురామానాయుడు, మాజీ సర్పంచ్ హరినాయుడు, మునికృష్ణమనాయుడు, జానకి రామానాయుడు, అరవింద తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దే టిడిపి నాయకుల నిరసనలు



పుత్తూరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మూడో రోజు మంగళవారం కూడా పుత్తూరులో టిడిపి నాయకులను పోలీసులను గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు తమ ఇంటి వద్దే పార్టీ కార్యకర్తలతో కలిసి నిరసనలు తెలిపారు. చంద్ర బాబు అరెస్టు దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న నియంత పోకడలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తిరిగి కోలుకోలేనంతగా బుద్ది చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి నాయకులు మోహనబాబు, అన్బు, దొరస్వామి, టిడిపి నాయకులు కన్నన్, ముని ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణాచారి, హమీద్, భాస్కర్, సుభాష్‌చంద్రనాయుడు, చంద్రరాజు, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చెంచయ్య, తెలుగు రైతు నాయకులు శ్రీధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బంద్ పిలుపునిచ్చిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వర రావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కె.వికె. ప్రసాద్ నాయుడు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షు లు పప్పు చంరదమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామచంద్రనాయుడు, డాక్టర్ మస్తాన్ యాదవ్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. నాగేశ్వరరావు ఇంటిలో నుండి బయటకు రానివ్వకుండా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. స్కిల్ డెవలప్‌వమెంట్‌లో శిక్షణ పొందిన వారు ఇతర దేశాల్లో కూడా ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. నీతి నిజాయితీకి మారు పేరు కలిగిన వ్యక్తి చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా 45 సంవత్సరాలు రాజకీయాలు చేశారని తెలిపారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఎలాంటి అవినీతికి పాల్పడకపోయినా ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టించి ఇరికించినట్లు తెలిపారు. ఈ కేసు నుండి చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలిపారు.

# సరిహద్దుల్లో బంద్ అంతంతమాత్రమే



తడ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ చేసిన బంద్ రాష్ట్ర సరిహద్దుల్లో అంతంతమాత్రంగానే జరిగింది. సోమవారం ఉదయం నుంచి యధావిధిగా బస్సులు నడిచాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పరిశ్రమలు పనిచేశాయి. స్థానిక బజారు సెంటర్లో దుకాణాలను కొద్దిసేపు కార్యకర్తలు మూయించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు అడ్డుకోవడంతో వారు వెనుతిరిగారు. టిడిపి సీనియర్ నాయకుడు కామిరెడ్డి యుగంధర్‌రెడ్డి, తెలుగు యువత రమేష్, మాజీ సర్పంచ్ ఏడుమలై తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కారూరులో పార్టీ కార్యకర్తలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అయితే అక్కడ టిడిపి క్యాడర్ ఒకచోటుకు చేరి చంద్రబాబుకు మద్దతుగా నినాదాలిస్తూ కొదినదసేపు ఆందోళన చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆర్.నీలకంఠం, తెలుగు రైతు అధ్యక్షుడు ఆంబాకం జీవా తదితరులు పాల్గొన్నారు. కొంతమంది నాయకులు సూళ్లూరుపేటకు వెళ్లి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ఆందోళనలో పాలుపంచుకున్నారు.

# అవినీతికి పాల్పడినందువలనే చంద్రబాబు జైలుకు

**- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



వెంకటగిరి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త: అవినీతికి పాల్పడినందు వలనే మాజీ సీఎం నారా చంద్ర బాబు నాయుడు జైలుపాల య్యారని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని కలవలపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఎన్నో అక్రమాలు జరిగాయన్నారు. అవినీతికి పాల్పడితే ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాకుంటే వెంటనే ఇప్పిస్తామన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. గత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కలవలపూడి గ్రామానికి ఏమీ చేయలేదని గ్రామస్థులు తెలిపారు. సచివాలయం, ఆర్‌బికే భవనాలు కూడా ఇక్కడ నిర్మించలేదన్నారు. సంక్షేమ పథకాలు రావడంలేదని స్థానికులు చెప్పడంతో అర్హత ఉంటే ఇప్పిస్తామని తెలిపారు. సైడ్ కాలువలు కావాలని, నిర్మితమైన టిడ్కో గృహాలు ఇవ్వాలని రామ్‌కుమార్ రెడ్డిని స్థానికులు కోరారు. సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో విజయలక్ష్మీ, తహసీల్దారు పద్మావతి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, నాగయ్య, దట్టం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్థంభం ఏర్పాటు



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన పురాతన ఆలయం అన్నపూర్ణసమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొత్త ధ్వజస్థంభం ఏర్పాటుకు సోమవారం పంచనామ నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో పంచనామను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కె.యస్.రామారావు హాజర య్యారు. ఆలయ పూజారి జనార్థన్ శర్మ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. 30 సంవత్సరాల నాటి ఆలయం అభివృద్ధికి నోచుకోక పోగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి చొరవతో కొత్త ధ్వజస్థంభంను ఏర్పాటుకు ఆర్‌డిఓ రామారావు సమక్షంలో పంచనామ నిర్వహించారు. కొత్తధ్వజస్థంభం ఏర్పాటు చేసిన తరువాత ఈ నెల 15న శాంతి పూజలు నిర్వహించుటకు నిర్ణయించామన్నారు. ఈ నెల 17లేదా 19న కుంభాభిషేకం నిర్వహించుటకు అర్చకులు నిర్ధారించామన్నారు. ఈ కార్యక్రమాల్లో అలయ పూజారి జనార్థన్‌శర్మ, డెప్యూటీ ఇఓ జే.వెంకట సుబ్బయ్య ఇఇ నూకరత్నం, ఎఇఓ లోకేష్‌రెడ్డి, అనుబంధ ఆలయాల సూపరింటెండెంట్ శ్రీహరి, సిఎస్ఓ రాజశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, వీఆర్ఓ సునీత, పోలీసు శాఖ తరపున సాంబశివయ్య, దేవస్థానం స్థపతి కుమార్, అనుబంధ ఆలయాల ఇన్‌చార్జి యోగేష్, గ్రామ ప్రజలు, పెద్దల చంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, నీలకంఠారెడ్డి, సుబ్బరాయ మొదలి, రఘురామయ్య, రామచంద్రారెడ్డి తదిరులు పాల్గొన్నారు.

# అటవీ సంపద సంరక్షణ సమాజంపై కూడా ఉంది!

**-జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంలో పిసిసిఎఫ్ మధుసూధన్‌రెడ్డి**



తిరుపతి(విద్య) సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: అటవీ సంపదను సంరక్షించే బాధ్యత కేవలం అటవీ సిబ్బందిది మాత్రమే కాదని, ఆ బాధ్యత సమాజం మీద కూడా ఉందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పిసిసిఎఫ్) అధికారి వై.మధుసూధన్‌రెడ్డి (ఐఎఫ్‌ఎస్) అన్నారు. సోమవారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీ జూపార్కు నందలి అటవీ అమరుల స్థూపం వద్ద జూ క్యూరేటర్ సి.సెల్వం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిసిఎఫ్ మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర వైల్డ్‌లైఫ్ వార్డెన్ రంగరాజు విచ్చేసి స్థూపం వద్ద అటవీ అమరులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అటవీ సంరక్షణ అలాగే అటవీ సంపదను కాపాడే విషయంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీనికోసం అటవీశాఖ కమ్యూనిటీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చిందని, ఇందులో పాల్గొనడానికి ఎకో పార్కులు, నగర వనాలు, నగర వాటికలు, పల్లెవనాలు, జంగిల్ బుక్‌లను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. తమ విధి నిర్వహణలో భాగంగా వన సహజ సంపదను కాపాడుకునే సందర్భంలో అటవీ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టిన 23 మంది అటవీ సిబ్బంది ప్రదర్శించిన అంకిత భావం మరియు వారి నిస్వార్థతను ఈ సందర్భంగా వారు కొనియాడారు. అటవీ స్మగ్లింగ్‌ను నిరోధించడంలో నూతన సాంకేతికతను ప్రవేశపెట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యావరణాన్ని మెరుగుపరచడంలో భాగంగా ప్రజలు ఎక్కువ మొక్కలు నాటడం, జాతీయ సంపద అయినటువంటి అడవులను రక్షించుకోవడంలో కీలక బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విధి నిర్వహణలో అమరులైన సిబ్బంది కుటుంబ సభ్యులను అదేవిధంగా అటవీ సంపద రక్షణలో ధైర్య సాహసాలు ప్రదర్శించిన సిబ్బందిని సన్మానించారు. సిసిఎఫ్ నాగేశ్వరరావు, ఎస్ఎస్ యశోద బాయి, డిఎఫ్ఓ సతీష్, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖ్, డిఎఫ్ఓ ఫ్లైయింగ్ స్క్వాడ్ శివకుమార్, రెడ్ శాండర్స్ డిప్యూటీ సిఎఫ్ శివకుమార్, జిల్లాలోని రేంజ్, సెక్షన్‌బీట్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



తిరుపతి(విద్య) సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: సోమవారం రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు ఆధ్వర్యంలో స్థానిక రుయా ఆసుపత్రి ముందు జన్మదిన వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులకు ఆయన పంచిపెట్టారు. అనంతరం వెయ్యి మంది పేదలకు ఆహార పొట్లాలు, మంచినీటి బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకతోటి రాజేష్, నాగేంద్ర, కుసుమకుమారి, బాల, కుమార్, కల్లూరు నాగరాజు గౌడ్, ప్రవీణ్, విజయ్‌కుమార్, ప్రసాద్, ఎస్.కుమార్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా రాధాకృష్ణుల కల్యాణోత్సవం



వడమాలపేట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: స్థానిక నక్కాపరమేశ్వరి ఆలయంలో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాధాకృష్ణుల కల్యాణోత్సవాన్ని వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం రాధా కృష్ణుల ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహించి పట్టు పీతాంబరాలతో నూతన వధూవరులుగా అలంకరింప చేశారు. పురోహితులు రఘునాథశర్మ ఆధ్వర్యంలో అగ్ని హోమం నిర్వహించి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు వేద మంత్రాల నడుమ మాంగళ్య ధారణ చేయించారు. రాత్రి రాధాకృష్ణులను పూలమాలతో అలంకరింపచేసి మంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పోకూరు మల్లికార్జున్‌శెట్టి ఉభయ దాతగా వ్యవహరించారు.

# జాతీయ నృత్యోత్సవాలు అదరహో!

**-కళాకారుల ప్రోత్సాహం మరువలేనిది -రాయలసీమరంగస్థలి చైర్మన్ గోపీనాధరెడ్డి**



తిరుపతి, సెప్టెంబర్ 11ప్రభాతవార్త: తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో మూడురోజుల పాటు జరిగిన కృష్ణదేవరాయ 33వ జాతీయ సంగీత నృత్యోత్సవాలు సోమవారం సాయంత్రం వైభవంగా ముగిశాయి, ఈ సందర్భంగా చివరిరోజు తెలుగురాష్ట్రాలతోబాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి చిన్నారి కళాకారులు, నృత్యకళాకారులు పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎం.మహీదర్‌రెడ్డి, డాక్టర్ ఆరూరు ఈశ్వర్‌ప్రకాశ్, వైఎస్ బాబు, దొడ్డారెడ్డి మనోహర్‌రెడ్డి, కెఎన్ రాజా, దివాకర్‌రెడ్డి, కస్పా పద్మనాభం, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్ తదితరులు 67మంది కళాకారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. కళాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసి వారిలో ఉత్సాహం నింపేలా ఈ ఉత్సవాలు దోహదపడుతాయన్నారు.

# సామాజిక బాధ్యతగా దాతలు సహకరించాలి : జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సామాజిక బాధ్యతగా దాతలు సహకరించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అమలు కొరకు ఏర్పాట్లపై సిఈఓ, సెట్విన్ మురళి కృష్ణతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెరిట్ సర్టిఫికెట్, ప్రైజ్ మనీ నియోజకవర్గ స్థాయి పోటీల నుండి అందించడం జరుగుతుందని, వాటికి సంబంధించి టీ షర్టులు, టోపీలు, వసతి భోజనం తదితరాల ఏర్పాటు అవసరమవుతుందని దాతల నుండి నిధులు అవసరమవుతాయని సిఈఓ సెట్విన్ తెలుపగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 691 గ్రామ వార్డు సచివాలయ పరిధిలో సుమారు ఒక లక్ష 57 వేల 548 మంది క్రీడాకారులు, రాష్ట్ర స్థాయిలో 114 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనుటకు వచ్చే క్రీడాకారులకు భోజన వసతికి, ఇతర సదుపాయాలకి పారిశ్రామిక వేత్తలు, ఇతర దాదులు నిధుల, వస్తువుల రూపం కానీ సహకారం అందించాలని కోరారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్ర, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ రెడ్డి, డిప్యూటీ జెడ్ఎం ఏపిఐఐసి జవహర్ పరిశ్రమలు ఇతర యాజమాన్యాలతో సమన్వయం చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ శ్రీహరి, డా. అరుణ సులోచన పాల్గొన్నారు.

# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా జాయింట్ కలెక్టర్



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : రెండవ దశ నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టా లని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిర ంలో డిఈ, ఏఈ, ఈఈలతో నాడు నేడు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండవ దశ నాడు నేడు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలన్నారు. సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ మెటీరియల్ వచ్చిన తరువాత నాడు నాడు పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఇంకనూ జిల్లాలో పేరెంట్స్ కమిటీ అకౌంట్స్‌లో అందుబాటులో ఉన్నా 13 కోట్ల రూపాయిలను అవసరమైన పాఠశాలలకు ట్రాన్స్‌ఫర్ చేసుకుని 10 కంపోనెంట్స్ పనులను ఎంఈఓలతో సమన్వయం చేసుకుని పూర్తి చేసేలా చూడాలన్నారు. ప్రతి మండలంలో వారానికి రెండు పాఠశాలలలో అన్ని కాంపోనెంట్స్ పనులను పూర్తి చేసి ఫోటోస్ అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయ్ కుమార్, నాడు నేడు ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి రెడ్డి, డిఈ, ఎఈ, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస సేతు ప్రారంభోత్సవ ఏర్పాట్లు సిద్ధం చేయాలి

**అధికారులను ఆదేశించిన కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : ఈ నెల 18వ తేది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న శ్రీనివాస సేతు వద్ద ఏర్పాట్లు సిద్ధం చేయాలని స్మార్ట్ సిటీ ఎండి, నర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీనివాస సేతు ప్రారంభో త్సవ ఏర్పాట్లపై నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో స్మార్ట్ సిటీ, పోలీస్, ఏఈకామ్, ఆఫ్కాన్స్ ప్రతినిధులతో కమిషనర్ సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడా ఇబ్బందులు లేకుండా శ్రీనివాస సేతు నిర్మాణ పనులు ఈ నెల 12వ తేది లోపు చేపట్టాలని అన్నీ మార్గాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ట్రాఫిక్ డిఎస్పి నరసప్ప, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, సిఎ శివప్రసాద్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల నిర్మాణాలతో దశదిశల అభివృద్ధి

**టిటిడి చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి**



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : రహదారుల నిర్మాణాలతో దశదిశల అభివృద్ధి చెందుతుందని టిటిడి చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్, 50వ డివిజన్లో నూతనంగా నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్డులను తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణలు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఊరైనా అభివృద్ధి చెందాలంటే మెరుగైన రహదారుల నిర్మాణాలు చేపట్టడమేనన్నారు. భవిష్యత్తులో మరిన్ని రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ సుమారు ఒక కోటి 20 లక్షల వ్యయంతో 22వ డివిజన్‌లోని గాయత్రి నగర్, మునిరెడ్డి నగర్‌లో రెండు సిమెంట్ రోడ్లును, అదే విధంగా 50వ డివిజన్‌లో శ్రీనగర్ కాలనీ, శ్రీరామ ఆలయం వద్ద రెండు సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, 22వ డివిజన్ కార్పొరేటర్ సునీత, 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనిల్ కుమార్, కార్పొరేటర్లు ఆధం రాధాకృష్ణారెడ్డి, దొడ్డారెడ్డి ప్రవల్లిక రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, మహేష్, నాయకులు డిష్ చంద్ర, తిమ్మారెడ్డి, గౌరి, రెడ్డిరాణి, తలారీ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన నాయుడుపేటలోని విన్నమాల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం నుజ్జునుజ్జుగా మారి గుర్తుపట్ట లేని విధంగా మారిపోయి ఉంది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వా సుపత్రికి తరలించారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు.

# ఏ.పి.లో కేంద్రం రాష్ట్రపతి పాలన విధించాలి !!

**- సిఎం జగన్‌పై ప్రజల తిరుగుబాటు తథ్యం.. కేసులకు భయపడం - ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**

కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను గుర్తించి కేంద్రం రాష్ట్రపతి పాలన విధించాలని ఎమ్మెల్సీ, కుప్పం టిడిపి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బంద్ సందర్భంగా సోమవారం కుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పద్నాలుగు ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన, అంతర్జాతీయ స్థాయి గల చంద్రబాబునాయుడుపై రాజకీయ కక్షతోనే అరెస్ట్ చేశారన్నారు. ఇప్పటికే వైకాపా ప్రభుత్వంపై ప్రజాగ్రహం పెల్లుబికిందన్నారు. త్వరలోనే సిఎం జగన్, ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గరపడ్డాయన్నారు. గతంలో హైదరాబాద్‌కు సాఫ్ట్‌వేర్ సంస్థలు తెచ్చి వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. అమరావతి, పోలవరం పూర్తి చేయాలనే తలంపులో ఉన్నారన్నారు. ఒక్కఛాన్స్ అంటూ వచ్చిన సిఎం జగన్ రెడ్డి తాను జైలుకు వెళ్లానని ప్రతిపక్షాల నేతలను సైతం జైలుకు పంపాలని చూడడం దారుణమన్నారు. వైకాపా ప్రభుత్వ అక్రమాలు ప్రశ్నిస్తే కేసులు, దాడులు చేస్తున్నారన్నారు. హిట్లర్, గడాఫీ లాంటి నియంతలు కాలగర్భంలో కలసి పోయారని సిఎం జగన్‌ను సైతం ప్రజలు పాతాళానికి తొక్కేస్తారన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్‌ల పాదయాత్రలు చూసిన ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కుప్పంలో ప్రజలు చంద్రబాబు అరెస్ట్‌పై ఎమోషనల్‌గా ఉన్నారన్నారు. ఇంకా ఏడు జన్మలెత్తినా వైకాపా మరలా అధికారంలో రావడం కుదరదన్నారు. జనసేనతో కలసి నిరంకుశ ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామన్నారు. కేసులతో భయపెడితే వైకాపా పరిస్థితి మరింత దిగజారుతుందని ప్రజలే చొక్కా పట్టుకుని నిలదీస్తారన్నారు. సమావేశంలో నేతలు ప్రేమ్‌కుమార్, డా॥ వెంకటేష్, శాంతారాం, ప్రతాప్, వెంకటేష్, జనసేన నరేష్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.